

కథా కౌముది

# నువ్వు + నేను = మనం

శ్రీనిధి యెల్లల

ఇది రెండో రోజు వరసుగా, నేను బాక్సు కట్టడం తను తీసుకోకుండా ఆఫీసుకి వెళ్ళడం. ఇద్దరి మధ్య మాటలు లేవు. అసలు చూపులు కూడా లేవు. భోజనానికి అన్నీ పెట్టి కూర్చున్నాను. వస్తే కదా పురుషుడు. అహంకారం...హుమ్...నీకే అంత ఉంటే నాకెంత ఉండాలి. నేను కూడా పిలవలేదు. నేను మాత్రం ఇంత అన్నం, కూరా ప్లేట్లో వేస్కుని దిగ మింగాను. కలిసి కాకుండా ఇలా విడిగా తినడం ఇబ్బందే కానీ, ఆ విషయం పైకి కనపడనివ్వలేదు. అమ్మో ఇంకేమైనా ఉందా అలుసైపోమూ!? ఈ కాండిడేట్ కి అసలు ఆకలి వెయ్యదా? సిగ్నల్ ఇవ్వడానికి అన్నట్లు ప్లేటులో గరిటతో టంగు టంగు మని కొట్టాను. విసురుగా లేచి వచ్చి, హల్దిరామ్స్ రెడీ మేడ్ మీల్స్ ప్యాకెట్ ని ఓవెన్ లో వేడి చేసుకుని తినడం మొదలుపెట్టాడు.

ఎంత పొగరు...ఎంత కండకావరం...ఎంత ఇది...ఎంత అది. ఛా! మాటలు కూడా అందడం లేదు. అసలు ఇంకోసారి ఈ రెడీమేడ్ ఫుడ్డుని తీస్కుని రాకూడదు ఇంట్లోకి అనుకున్నాను. గిన్నెలు సర్దుతూ ఓరకంట చూస్తును కదా, ఎంచక్కా లాప్ టాప్ లో ఏదో కెలుక్కుంటున్నాడు. అప్పట్లో ఆడవాళ్ళకి ఆడవాళ్లతోనే సవతి కష్టాలు వచ్చేవి. ఈరోజుల్లో ఈ లాప్ టాప్ లు, ఐపాడ్లు తగలడ్డాయ్ మా ప్రాణానికి. తిన్నగా కాపురం కూడా చేస్కోనివ్వడం లేదు జనాలని. పక్కనున్న పెళ్ళాం అందంగా వుందో లేదో చెప్పరు కాని, అక్కడెక్కడో వున్న హీరోయిన్ కి, ఫ్రెండ్స్ కి లైకులు, కామెంట్లు పెడతారు ఫేస్ బుక్ లో.

ఓ ముద్దూ ముచ్చటా ఏమీ పట్టవు. గూట్లో గుండ్రాయి లాగా ఉంటాడు. సరే ఎన్ని రోజులు ఇలా ముడుచుకు కూచుంటాడో చూస్తా. ప్రాణం లేని వస్తువులతో ఎన్ని రోజులు కాపురం చేస్తాడో చూద్దాం. బెడ్ రూమ్ లోకి వెళ్ళి అలిగిన మంచంపై వాలి ఆన్ లైన్ ఎఫెం పెట్టుకుని వింటూ వున్నాను. నాకిష్టమైన పాట బాలూ గారిది,"మాటే రాని చిన్నదాని కళ్ళు పలికే ఊసులూ"వస్తోంది. ఎంత హాయిగా వుంది పాట. పెళ్ళికి ముందు ఎంత హుషారుగా వుండేదాన్ని, సెలయేటి వేగం, వెన్నెల రాత్రుల మౌనం, చిగురుటాకుల రాగం అన్నీ కలిస్తే నేను లాగా వుండేదాన్ని. ఇదిగో ఈ పురుషున్ని ఏ ముహూర్తాన చూసానో సెలయేటి ప్రవాహం ఆగిపోయి చలనం లేని చెరువు లాగా అయిపోయాను. వెన్నెల కరిగి కృష్ణ పక్షం మొదలయ్యింది, ఎందుకులే ఎక్కువ ఆలోచిస్తే చికాకులో వైరాగ్యం వస్తుంది....!

★★★★★★★★★★




ఎంత పొగరు. మొగుడు అనే గౌరవం ఏ కాస్తన్నా వుందా! అవునులే ఈ కాలం ఆడపిల్ల కదూ, వీళ్ళకి సమాన హక్కుల కోసం రచ్చ కెక్కడం మాత్రమే తెలుసు. సమాన గౌరవం గురించి ఏమి తెలుస్తుంది. ఒక చిన్న మాట అంటే ఇంతెత్తున్న ఎగిరి దూకి మౌన యుద్ధం పాటించాలా? అయ్యో, మొగుడు మాట్లాడట్లేదే, కొంచం పలకరిద్దామని ఏమైనా వుందా? అసలు ఈ పిజ్జా బర్గర్ల దేశంలో ఏం తింటున్నాడో అనే బాధ కాస్తైనా వుందా? వంటిల్లు, పడకటిల్లు తన అదుపులో పెట్టుకుని, తనకీ, తన తిండికి నన్ను బాగా అలవాటు చేసేసేకుని ఎక్కడికి పోతాడులే అని అనుకుంటోన్దేమో? ఆ పప్పులేమీ నా దగ్గర ఉడకవు. నాకు గానీ తిక్కరేగిందంటే కడుపు ఆకలి ఐనా, ఆ ఆకలి ఐనా కేర్ చెయ్యను.

పెళ్ళి చూపుల్లో ఎంత బాగుంది, బాపూ గారి బొమ్మలా, వేసవిలో మల్లెపువ్వులా, పల్లెల్లోని ముద్దమందారం లా అబ్బా...నా పంట పండింది అనుకున్నాను. పెళ్ళికి ముందు ఎంత జాలీగా వుండేవాణ్ణి...నా రూములో నా ఇష్టం వచ్చినట్లు వస్తువులు పెట్టుకునే వాన్ని, ఎప్పుడూ కావలిసి వస్తే అప్పుడు నా మిత్రబృందం వాలిపోయేవారు, అన్ని కలర్ల ఫిల్ములు చూసేవాడ్ని, ఎత్తితే బీరుబుడ్డీలు లేచిపోయేవి...మరి ఇప్పుడో? ఆఫీసునుండి రాగానే షూల నుండి వాచీ వరకూ ఏవి ఎక్కడ పెట్టాలో అక్కడే పెట్టాలి. పొరపాటున ఇంకెక్కడైనా పెడితే స్నానం చెయ్యకుండా పూజలో కూర్చున్న వాడిలా, నన్నొక్క చూపు చూస్తుంది. ఈవిడ పర్మిషన్ లేనిదే నా మిత్రబృందం తాలూకు ఒక్క కాకి కూడా వాలడానికి లేదు. సీరియల్లన్నీ ఐపోయాక ఒక పావుగంట ఇస్తుంది నాకు నచ్చినవి చూసుకోడానికి. సరేలెమ్మని ఫేస్ బుక్, యు ట్యూబ్ అలవాటు చేసుకుంటే పట్టించుకోడం లేదని నస.

బేసిగ్గా వీళ్ళకి ఏం కావాలో వీల్లకే తెలిసి చావదు. ఒకటి చెప్తే తక్కువా, రెండు చెప్తే ఎక్కువా. కోట గారు, ‘భద్రం బీకేర్ ఫుల్ బ్రదరూ’ అని, నాగార్జున గారు ‘వద్దురా సోదరా’ అని ఎంత చెప్పిన కూడా విని చస్తే కదా. సరేలే ఎక్కువ ఆలోచిస్తే ఫార్ములు వదిలేసి కాషాయం కట్టుకోవాలనిపిస్తుంది. పడుకుందాం...అమ్మో మంచం వద్దు అక్కడ ఈ టైములో అతీత శక్తులు ఉంటాయ్...కౌచ్ లోనే ముడుచుకుని పడుకుంటాను.

★★★★★★★★★★★



**మూడో రోజు:** ఛా! ఏమి బాగోలేదు. ఇలా ఆంధ్ర, తెలంగాణాల్లా వుండడం. కష్టమో నష్టమో ఎదో ఒకటి మాట్లాడుకుంటు ఉంటేనే బాగుంది. మాట్లడేద్దామా? వద్దులే. తను మాట్లాడొచ్చు కదా? పాపం. బాగా కోపం వచ్చినట్లు ఉంది. నేనే అనవసరంగా నోరు పారేసుకున్నాను. వెయ్యి మాటల్లో చెప్పలేనిది ఒక్క స్పర్శ తో చెప్పగలడు. నా నడుము చుట్టూ చెయ్యి వేసి పడుకుంటే ఎంత ధీమాగా వుండేది. కోట్లిచ్చినా కొనలేని ధైర్యం అది. ఇక తన ప్రేమలో నన్ను ఉక్కిరి బిక్కిరి చేసే క్షణాలు మర్చిపోగలనా అసలు. నాకే బుద్ధిలేదు. పాపం ఆ ఆఫీసులో ఏమి తింటున్నాడో ఏమో. ఛా! ఎన్ని మాటలు అనుకున్నాను.

కుదురు లేని నిలకడ లేని సెలయేరుకి ఒక కుదురు, ఒక స్థానం ఇచ్చింది తనే కదా. కృష్ణపక్షం అంటూ ఒకటి లేకపోతే వెన్నెలకి విలువ ఉంటుందా? చిగురుటాకులు ముదిరి రాలితేనే కదా కొత్త అందాలకి అవకాశం వచ్చేది. నా దగ్గర నుండి ఆయన ఏమీ దోచుకుంది లేదు. ఇంకా తన స్నేహంతో నన్ను పరిపూర్ణం చేసాడు. పిచ్చి సీరియళ్ళు, కథలు చదివి మనసు పాడు చేసుకుంటున్నాను. ఇక నా వల్ల కాదు ఈ శపధాలు, ఛాలెంజులు. తను విసుకున్నా, కోపం తెచ్చుకున్నా నేను మాటాడేస్తాను...అంతే.

★★★★★★★★★★★★★




ఛీ! ఎదవ బతుకు. సరిగ్గా తిని మూడు రోజులైంది. ఈ బ్రెడ్డు ముక్కలు తినీ తినీ నాలుక మందం అయిపోయింది. ఐనా నాకింత కోపం ఉండకుండా ఉండాల్సింది. పాపం నాకోసం అందర్నీ, ఉద్యోగాన్ని వదిలేసి ఇక్కడ ఖైదీ లా ఉంటోంది. ఎదో

విసుగులో ఒక మాట అంటే నేను పడోచ్చుకదా. కొవ్వు. నాకీమాత్రం జరగాల్సిందే. ఎంత చక్కగా బాక్సు కట్టేది. తన ప్రేమంతా తన బాక్సు కట్టే విధానం లోనే తెలిసిపోయేది. నేను కాస్త అలసిపోయినా ఎంత కంగారు పడేది. నా దగ్గర గువ్వలా ఒదిగిపోయేది, మైనం లా కరిగిపోయేది.

ఇల్లు ఎంత ఆర్టిస్టిక్ గా పెడుతుంది. ఒక్క రోజైనా నా వస్తువుల కోసం వెతుకున్నది లేదు. ఎప్పుడూ వాటి స్థానాల్లో అవి రెడీగా ఉండేవి. మా ఫ్రెండ్స్ వస్తే ఏదైనా చేసి పెట్టాలని ముందుగానే చెప్పమనేది కానీ ఎప్పుడూ ఎవరినీ రావద్దని చెప్పలేదే. అంత అందం ముందుంటే ఇంక కలర్ ఫిల్ముల అవసరం ఏంటి నాకూ. ఏమి చెప్పినా నా ఆరోగ్యం కోసమే కదా...నేనే ఫూల్ ని ఎన్నడూ తనని మెచ్చుకున్న పాపాన పోలేదు. నా ఫీలింగ్స్ ని ఎప్పుడూ సరిగ్గా తెలియజేసిందే లేదు. ఏమైనా సరే తనతో మాట్లాడాల్సిందే...చివరికి కాళ్ళు పట్టుకోడానికైనా నేను రెడీ.....హా.!

★★★★★★★★★★★★

**నాలుగో రోజు:**



"ఆఫీస్ టైం అవుతోంది లేరా"...

"ఒక 5మినిట్స్ రా ప్లీజ్" ...

"సరే బజ్జోలే, నేను లేపుతా కాసేపాగి."

"ఇడ్లి సూపర్ ...పచ్చడి అదిరింది"...

"అన్ని బాక్సులు తినెయ్యాలి, ఫ్రూట్స్ పెట్టిన బాక్సు ఈవెనింగ్ 4 కలా తిను" ...

"అలాగే. నీకు ఈరోజు డ్రైవింగ్ క్లాస్ అప్పాయింట్మెంట్ తీస్కున్నాను, త్వరగా ఇంటి పని చూస్కుని వెళ్ళు. బి బ్రేవ్"...

"ఓకే రా. వీకెండ్ జెమ్స్ షో కి వెళ్దామా, కొన్ని చైన్స్ కొనాలి",...

"ఓకే డన్...సాయంత్రం మిరపకాయ్ బజ్జీలు చేస్తావా తినాలని ఉంది"....

"సరే, టేక్ కేర్ బాయ్"....

ఓకే మా. బాయ్. ఉ.... మ్మా......

**మూడు రోజుల క్రితం:**

"ఆఫీస్ కాల్ మాట్లాడేటప్పుడు టీవీ వోల్యూం తగ్గించవచ్చుకదా".

"నాకేం తెలుసు నువ్వు కాల్ లో వున్నావని"

'నీకేం తెలుసు ఏమి తెలీదు, నా టెన్షన్స్ నీకు అర్ధం కావు. గంట సేపు వంటిట్లో ఉండి రోజంతా టీవీ ముందు, కిట్టి పార్టీల్లో గడపడం మాత్రం తెలుసు".

"కోపంలో ఏది పడితే అది మాట్లాడొద్దు...నువ్వెలాగు నాతో మాట్లాడవు. నా పాటికి నేను టీవీ చూడడం కూడా తప్పేనా...నాకేమన్నా సరదానా పార్టీలకు వెళ్ళడానికి. మీ కొలీగ్ వాళ్ళ మిసెస్ లు అని పరిచయం చేసి మీరు సోషల్ గా మూవ్ అవమంటేనే కదా నేను పార్టీలకి వెళ్ళేది."

"అన్నిటికీ అన్ని సమాధానాలు చెప్తావ్...నీతో మాట్లాడడం వేస్ట్..."

"ఎవరిమీదో కోపం నాపై చూపిస్తావ్ నీతో మాట్లాడడం కూడా వేస్ట్..."

"పో"...

"నువ్వు కూడా పో"...

★★★★★★★

వాళ్ళలో ఎవరు ముందు మాట్లాడారో వాళ్ళకే తెలీదు. తెలుసుకోవాలని కూడా వాళ్ళకి ఉన్నట్టు లేదు. మూడు రోజులుగా మౌన మునుల్లాగా మాట్లాడుకోవట్లేదనే విషయం గురించి అసలు గుర్తే లేదు.

★★★

Click here to share your comments on this story